క్లుప్తంగా

ఏఓగా రమణమూర్తి



నరసన్నపేట: స్థానిక వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ (ఏఓ)గా ఏపీవీ రమణమూర్తిని వైద్యవిధాన పరిషత్ కమిషనర్ నియమించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో క్లరికల్ సూపరింటెండెంట్‌గా ఈయన పనిచేస్తున్నారు. రెండు రోజుల క్రితం రాష్ట్రంలో 40 మందికి ఉద్యోగోన్నతి కల్పించారు. విజయవాడలో జరిగిన కౌన్సెలింగ్‌లో నరసన్నపేట ఆస్పత్రిని కోరుకోవడంతో ఈ మేరకు ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. సూపరింటెండెంట్‌లను ఏఓలుగా ఉద్యోగోన్నతి కల్పించడం పట్ల ఏపీ వైద్య విధాన పరిషత్ ఎంప్లాయిస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమణమూర్తి తదితరులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

రూ.93.94 లక్షలతో నాడు-నేడు పనులు



ఫస్ట్ ఫ్లోర్ నిర్మాణం చేపడుతున్న దృశ్యం

పాతపట్నం: మండల కేంద్రంలోని ఆల్ ఆంధ్ర రోడ్డు సమీపంలోని ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నాడు-నేడు రెండో విడతలో రూ.93.94 లక్షలతో ఎనిమిది అదనపు తరగతి గదులు మంజూరయ్యాయని ఐటీడీఏ డీఈఈ బి.శిమ్మన్న ఆదివారం తెలిపారు. గతేడాది నుంచి ఇంటర్ కూడా నిర్వహించడంతో అదనపు తరగతి గదులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని, ప్రస్తుతం ఫస్ట్ ఫ్లోర్ వేయడం జరిగిందన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం



సవర జాడుపల్లిలో గిరిజనులతో మాట్లాడుతున్న మామిడి శ్రీకాంత్

మెళియాపుట్టి: సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి సాధ్యమని, రానున్న రోజుల్లో మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ అన్నారు. మండలంలోని జాడుపల్లి, సవర జాడుపల్లి, పెద్దపద్మాపురం, చాపర తదితర గ్రామాల్లో ఆదివారం పర్యటించారు. పెద్దపద్మాపురం గ్రామానికి చెందిన సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు లింగాల సంజీవరావు అనారోగ్యంతో ఉండగా ఆయనను పరామర్శించారు. పలు గ్రామాలలోని గిరిజనులతో కలిసి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీఎం జగన్ పాలనలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. వైస్ ఎంపీపీ ఆదినాయుడు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

95 శాతం ఈ-క్రాప్ పూర్తి

- వ్యవసాయశాఖ ఏడీ రవీంద్రభారతి

నరసన్నపేట: నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో ఖరీఫ్ సీజన్‌కు 95 శాతం మేర వరి పంటకు ఈ-క్రాప్ పూర్తిచేసినట్లు వ్యవసాయ శాఖ ఏడీ రవీంద్రభారతి తెలిపారు. 68,439 ఎకరాల్లో 48,179 మంది రైతులు ఈ-క్రాప్ చేయించుకున్నట్లు పేర్కొన్నారు. నరసన్నపేట మండలంలో 16,520 ఎకరాల్లో 11,390 మంది రైతులు, పోలాకి మండలంలో 17,254 ఎకరాల్లో 13,050 మంది రైతులు, జలుమూరు మండలంలో 19,053 ఎకరాల్లో 14,268 మంది రైతులు, సారవకోట మండలంలో 15,612 ఎకరాల్లో 9,471 మంది రైతులు ఈ-క్రాప్ చేయించుకున్నారని వివరించారు. ఈ మేరకు సచివాలయాల వద్ద సామాజిక తనిఖీల నిమిత్తం రైతుల జాబితాను ప్రదర్శించడం జరిగిందన్నారు. వీటిపై అభ్యంతరాలు స్వీకరణ ఆదివారంతో ముగిసిందన్నారు. నవంబర్ ఒకటిన రైతుల జాబితా ప్రదర్శిస్తామన్నారు.


రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

హిరమండలం: మండలంలోని వంశధార నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు స్థానిక ఎస్‌ఐ జి.నారాయణస్వామి తెలిపారు. వంశధార నది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తుండగా భగీరథిపురం గ్రామ సమీపంలో ఆదివారం రెండు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేశామన్నారు. అనంతరం ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. భగీరథిపురం గ్రామానికి చెందిన వంజరాపు రాజు, కోటరాములుకు చెందిన ట్రాక్టర్లుగా గుర్తించి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

సచివాలయ వ్యవస్థతో గ్రామస్వరాజ్యం



సరుబుజ్జిలి సచివాలయం ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం
- సచివాలయం, ఆర్‌బీకే భవనాలు ప్రారంభం

సరుబుజ్జిలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన గ్రామ సచివాలయం వ్యవస్థ ద్వారా గ్రామ స్వరాజ్యం వచ్చిందని శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. సరుబుజ్జిలిలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ప్రజల వద్దకు పాలన వచ్చినప్పుడే సమగ్రాభివృద్ధి సాధ్యపడుతోందని వెల్లడించారు. ప్రతీ ఒక్కరికి విద్య, వైద్యం, మౌలిక వసతులు కల్పించనప్పుడే సమాజం అగ్రగామిలో పయనిస్తోందన్నారు. రైతులకు ఆర్బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించే ప్రక్రియ విజయవంతమైందన్నారు. పేదరికం అనేది విద్య, వైద్యం,సేద్యానికి అడ్డు కాకూడదనే ఆలోచనతో అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం జగన్‌కు ప్రజలంతా సహకరించాలని కోరారు. సంక్షేమ పథకాలు డోర్ డెలవరీ విధానంలో చేరేందుకు ఏర్పాటు చేసిన సచివాలయం వ్యవస్థ సత్ఫలితాలు ఇస్తోందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, ఎంపీడీఓ మురళీమోహన్‌కుమార్, వైస్ ఎంపీపీ జి.వి.శివానందమూర్తి, పార్టీ మండల కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బాన్న రాము, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మూడడ్ల రమణ, కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ కొవిలాపు చంద్రశేఖర్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎడ్ల ఈశ్వరరావు, స్థానిక సర్పంచ్ బొడ్డేపల్లి చాందిని, ఎంపీటీసీ సభ్యురాలు ఇల్లాకుల ఈశ్వరమ్మ, మండల మహిళా అధ్యక్షురాలు బొడ్డేపల్లి చామంతి, పార్టీ నాయకులు బొడ్డేపల్లి హరి, ఇల్లాకుల సూర్యప్రకాశ్, పెద్ది రాజేష్, గుడ్ల తిరుమలరావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాలతో ప్రజల వద్దకు పాలన

ఎల్.ఎన్.పేట: గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో ప్రజల వద్దకు పరిపాలన వచ్చిందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని రావిచెంద్రి, చొర్లంగి గ్రామ సచివాలయ నూతన భవనాలను ఆదివారం ఆమె ప్రారంభించారు. గ్రామ సచివాయాలకు శాశ్వత భవన నిర్మాణాలు చేపట్టడం ఎంతో గొప్పవిషయమన్నారు. ఒక్కొక్క భవన నిర్మాణానికి రూ.40లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. రాజకీయాలతో పనిలేకుండా ప్రభుత్వ పరిపాలన ప్రజల వద్దకు తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికి దక్కిందని కొనియాడారు. ప్రభుత్వ పథకాల కోసం మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఆయా శాఖల అధికారులే గ్రామాల్లో అందుబాటులో ఉండేలా పరిపాలన తీసుకువచ్చారన్నారు. సచివాలయ పాలన దేశంలో ఆదర్శనీయంగా నిలిచిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల్లో ప్రజలకు జవాబుదారీతనం పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పెనుమజ్జి విష్ణుమూర్తి, పీఏసీఎస్ అధ్యక్షుడు కొల్ల కృష్ణ, వైస్ ఎంపీపీ శివ్వాల ఇందమ్మ, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, సర్పంచ్‌లు కొల్ల ఈశ్వరమ్మ, సవర గంగమ్మ, ఎంపీటీసీలు కింతలి చిరంజీవి, కొల్ల స్వర్ణలత, లోచర్ల లక్ష్మి, పార్టీ నాయకులు లోచర్ల మల్లేశ్వరరావు, శిమ్మ సాంబశివరావు, శివ్వాల షణ్ముఖరావు, లుకలాపు సుధీర్, ఈగల చిన్నారావు, కొల్ల వరహాలునాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఎల్.ఎన్.పేట: రావిచెంద్రిలో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



గురండిలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన

పాతపట్నం: మూడేళ్లలో ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ద్వారా చేకూర్చిన ప్రయోజనాన్ని ప్రజలకు తెలియజేయాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని బగడల, గురండి, రట్టిణి, సింగుపురం గ్రామాల్లో ఆదివారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా, లేదా అని అడిగి తెలుసుకుంటూ.. ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రతి ఇంట్లో కుటుంబ సభ్యులకు చేకూర్చిన ప్రయోజనాన్ని వివరిస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిన రాసిన లేఖను ఆ కుటుంబాలకు అందజేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన ప్రతీ ఒక్కరు గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే సంక్షేమ పథకాలు అందజేయటం జరుగుతుందన్నారు. రాజకీయాలతో పనిలేకుండా సంక్షేమ పథకాలను అందించే ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం నవరత్నాల పథకాలు అమలు చేయటంతోపాటు చెప్పని ఎన్నో పనులు చేస్తున్నామని గుర్తుచేశారు. వచ్చే ఎన్నికల్లోనూ సీఎం జగన్‌ను, వైఎస్సార్‌సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు కోరారు. అడ్డదారుల్లో అధికారం పొందేందుకు గ్రామాలకు వస్తున్న టీడీపీ నాయకులను నమ్మవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దొర సావిత్రమ్మ, ఎంపీడీఓ పి.జయంత్ ప్రసాద్, పార్టీ దేవాంగుల జిల్లా అధ్యక్షుడు మంచు చంద్రయ్య, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.పదీప్, సచివాలయ మండల కన్వీనర్ సూర్యం, పార్టీ నాయకులు శిష్టు తులసీనాయుడు, బంటుపల్లి రామారావు, చీకటి పద్మరాజు, కర్రి లక్ష్మీనారాయణ, పడాల రంజీత్, ఢిల్లేశ్వరరావు, దువ్వారి జోగారావు, దొర పార్వతీశం, రాము, తేజ, పనుకు మోహన్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడి ఆదా



ఎల్.ఎన్.పేట: చొర్లంగిలో రైతులకు అవగాహన కలిగిస్తున్న ప్రకృతి వ్యసాయ సిబ్బంది

ఎల్.ఎన్.పేట: ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులతో పెట్టుబడి తగ్గుతుందని ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్పీలు అన్నారు. మండలంలోని చొర్లంగి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం సాగు పద్ధతులపై ఆదివారం రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంతో రసాయన ఎరువులు, పురుగు మందుల ఖర్చు తగ్గుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతుల్లో పంటలు పండించే రైతుల వివరాలను సేకరించటం జరుగుతుందన్నారు. సేంద్రియ పద్ధతుల్లో దిగుబడులు సాధించిన పంట ఉత్పత్తులను మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వరి పంట కోతల తరువాత అపరాల పంటలతోపాటు తీగజాతి, ఆకుకూరలు, చిరుధాన్యాల పంటలు వేసుకోవాలన్నారు.

ప్రకృత్యి వ్యవసాయమే శ్రేయస్కరం

హిరమండలం: ప్రకృతి వ్యవసాయమే శ్రేయస్కరమని ప్రకృత్యి వసాయ ఎంసీఆర్ఎఫ్ రాములమ్మ అన్నారు. హిరమండలంలోని నౌగూడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులతో ఆదివారం యూనిట్ లెవల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవామృతం తయారీ, పంట కోత ప్రయోగం, సీజనల్ వారి కషాయాల తయారీపై అవగాహన కల్పించారు. ఐసీఆర్‌పీ తేజ, రైతులు పాల్గొన్నారు.



హిరమండలం: జీవామృతం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ఆలయాల్లో సంప్రోక్షణ పూజలు



నీలమణిదుర్గ ఆలయంలో అమ్మవారికి సంప్రోక్షణ చేస్తున్న అర్చకులు

పాతపట్నం: ఉత్కలాంధ్రుల ఆరాధ్యదైవం పాతపట్నం గ్రామ దేవత నీలమణిదుర్గ అమ్మవారి ఆలయంలోకి భక్తులకు ఆదివారం ఉదయం 7 గంటలకు పునః దర్శనం కల్పించామని ఆలయ ఈఓ టి.వాసుదేవరావు తెలిపారు. శనివారం రాత్రి చంద్రగ్రహణం సందర్భంగా ఆలయాన్ని మూసివేసి, గ్రహణానంతరం సంప్రోక్షణ, ప్రత్యేక పూజలు చేశామన్నారు. అలాగే స్థానిక మార్కెట్ యార్డు వద్ద ఉన్న వెంకటేశ్వర ఆలయం, మహేంద్రతనయ నది పక్కన ఉన్న నీలకంఠేశ్వర ఆలయాలను శుద్ధి చేసి భక్తులకు దర్శనం కల్పించామన్నారు.

నేడు బొరిగివలసలో జగనన్న ఆరోగ్య సురక్ష

నరసన్నపేట: మండలంలోని బొరిగివలసలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బి.మధుసూదనరావు ఆదివారం తెలిపారు. నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తారన్నారు. వైద్య తనిఖీలు చేసి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. వైద్య శిబిరాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు బలదలో 'గడపగడపకు మన ప్రభుత్వం'

కొత్తూరు: మండలంలోని బలద గ్రామ సచివాలయం పరిధిలో ఈ నెల 30న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే రెడ్డి శాంతి నిర్వహించనున్నారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మాకవరం గ్రామంలో నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే రెడ్డి శాంతి హాజరవుతున్నట్లు పీఏసీఎస్ డైరెక్టర్ గార రాజులునాయుడు తెలిపారు. అలాగే రైతు భరోసా కేంద్రం ప్రారంభిస్తారన్నారు.

ఆకట్టుకున్న వేషధారణలు



వివిధ వేషధారణలు

ఆమదాలవలస: స్థానిక మున్సిపాలిటీ పరిధి గేదెలవానిపేటలో నిర్వహిస్తున్న నందన్న ఉత్సవాల సందర్భంగా శనివారం గ్రామంలో గల యువకులు, వృద్ధులు వివిధ వేషధారణల్లో అలరించారు. ఈ సందర్భంగా అన్నమాచార్యునితో సహా వేంకటేశ్వరస్వామి, పద్మావతి, అలివేలు మంగమ్మ వేషధారణలు ఆకట్టుకున్నాయి.

ఆత్మీయ సమ్మేళనం



బూర్జ: 1994-95 బ్యాచ్ విద్యార్థులు

బూర్జ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994-95లో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు అదే పాఠశాల ఆవరణలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 141 మంది 25 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. రూ.50 వేలు స్కూల్ అభివృద్ధికి హెచ్‌ఎం హరనాథకు అందజేశారు. వి.అచ్యుతరావు, శ్రీనివాసరావు, తిరుమల, సురేష్ కుమార్, విజయగణపతి, వెంకటేష్, ప్రసాద్, సంతోష్, బాలచంద్ర, కల్పన, వినీత్ కుమార్, రూప, శ్రీదుర్గ తదితరులు పాల్గొన్నారు.

చినకాగితాపల్లిలో..

సరుబుజ్జిలి: చినకాగితాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1982-83 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు సన్మానించారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని విద్యార్థులు సంతోషంగా గడిపారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు.



సరుబుజ్జిలి: 1982-83 బ్యాచ్ విద్యార్థులు

మురుగునీటి సమస్య పరిష్కరించాలి

కొత్తూరు: మండల కేంద్రంలోని కాలేజీ రోడ్డులో మురుగు నీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం నాటికి మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాదరావు మాట్లాడుతూ.. ఏబీ రోడ్డులో మూసిన కల్వర్టును తెరిపించాలని డిమాండ్ చేశారు. కల్వర్టును తెరవాలని ఉన్నతాధికారులు ఆదేశించినప్పటికీ.. స్థానిక పంచాయతీ, రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. నవంబర్ 4న ఏబీ రోడ్డును స్తంభింపజేస్తామన్నారు.

జగనన్నే మళ్లీ సీఎం కావాలి

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: అన్ని వర్గాల వారి సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇచ్చిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. రావిచెంద్రి గ్రామ సచివాలయం వద్ద ఆంధ్రప్రదేశ్‌కి జగనన్నే ఎందుకు కావాలంటే.. అనే కార్యక్రమంపై మండల స్థాయి వైఎస్సార్‌సీపీ నాయకులకు ఆదివారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 2019లో సీఎంగా బాధ్యతలు చేపట్టిన జగనన్న ప్రతీ కుటుంబానికి లబ్ధి చేకూరేలా పథకాలు అమలు చేశారని గుర్తుచేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం నవరత్నాల పథకాలను ప్రజల వద్దకు తీసుకువచ్చారన్నారు. ఎన్నికల సమయంలో చెప్పని హామీలు కూడా అమలు చేశారని వివరించారు. కరోనా వంటి కష్ట కాలంలోనూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత జగనన్నకు దక్కిందన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు రాజకీయ లబ్ధికోసం, పదవుల కోసం ప్రజల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. టీడీపీ నాయకుల తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టాల్సిన బాధ్యత వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు కొనసాగాలంటే సీఎంగా జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పెనుమజ్జి విష్ణుమూర్తి, పీఏసీఎస్ అధ్యక్షుడు కొల్ల కృష్ణ, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, పార్టీ నాయకులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గౌరీపౌర్ణమి ఉత్సవాలు



ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేటలో కాటమరాజు వేషం



ఎచ్చెర్ల: లావేరు మండలం తామాడలో గౌరమ్మ ఉత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని పలు గ్రామాల్లో గౌరీ పౌర్ణమి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఫరీదుపేట, కొత్తపేట, కేశవరావుపేట, ఎస్ఎంపురం, బొంతలకోడూరు, పొన్నాడ తదితర గ్రామాల్లో ఈ ఉత్సవాలు కమిటీల నిర్వాహకులు నిర్వహించారు. గౌరీనందీశ్వరులకు ప్రత్యేక పూజలు చేశారు. పగటి వేషాలు ఆకట్టుకున్నాయి. యువత ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

తామడలో..

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని తామాడ గ్రామంలో గౌరమ్మ, నందన్న ఉత్సవాలను వేడుకగా నిర్వహించారు. గౌరమ్మ, నందన్నలను పురవీధుల్లో ఊరేగించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఎండుతున్న వరి పొలాలు



గొర్రిబంద సమీపంలో వరి పొలానికి ఇంజిన్ పెట్టిన దృశ్యం

సారవకోట: మండలంలో వర్షాభావ పరిస్థితుల వల్ల వరి పంట పొలాలు ఎండుతున్నాయి. గతకొద్ది రోజులుగా వర్షాలు లేకపోవడంతో మెరక ప్రాంతాలైన పెద్దలంబ, జమచక్రం, కిడిమి, గోవర్ధనపురం, మూగుపురం, మదనాపురం తదితర గ్రామాలలో పంట పొలాలు ఎండి పోతున్నాయి. చుట్టు పక్కల ఉన్న నీటి వనరుల నుంచి ఇంజిన్లతో పంట పొలాలకు నీటిని పెడుతున్నారు. ఇదే వర్షాభావ పరిస్థితి కొనసాగితే పంటలు చాలావరకు దెబ్బతింటాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.